


# దరి చేరిన పడవ

— పోల్కంపల్లి శాంతాదేవి

శ్రీమతి సువర్చలాదేవి ప్రముఖ సంఘసేవకురాలు. ఆమె జీవితం పూర్తిగా దీనులకూ, దుఃఖితులకూ అంకితం చేసిన మనిషి. ఆమె ఆధ్వర్యంలో అనాధ, పతిత సేవాశ్రమాలు, వృద్ధులకు సేవాగృహాలు అనేకం నడుస్తున్నాయి: రోజూ ఎందరో వస్తుంటారు ఆమె దగ్గరికి. తమ తమ గోడు చెప్పుకొంటారు. ఆశ్రయమో, సహాయమో పొందుతుంటారు.

ఆరోజు ఆమె పూజాదికాలు పూర్తిచేసుకొని విజిటింగు రూంలోకి వచ్చేసరికి సోఫాలో తలదించుకొని కూర్చొన్న ఒకప్రౌఢ స్త్రీ కనిపించింది. ఆమె వయసు ముప్పై అయిదేళ్ళు దాటిఉండవచ్చు. అందంగా ఉన్నా బ్రతుకులో అలిసిపోయినట్టుగా కనిపిస్తుంది.

సువర్చలా దేవి దగ్గరికి వచ్చినప్పుడు తలదించుకు వచ్చినస్త్రీలు ఆమెతో ఒకసారి మాట్లాడిన తరువాత ఆమె చెప్పే ధైర్యవచనాలు, ఊరడింపు వాఖ్యాలు విన్న తరువాత తలఎత్తుకొని క్రొత్త ఆశలతో తిరిగివెడుతుంటారు.

"ఏమ్మా? ఏం పేరు?" ఆదరంగా అడిగింది సువర్చలాదేవి.

"నాపేరు పార్వతి అండీ"

"చెప్పమ్మా! ఏంకావాలి? నువ్వు ఏం మాట్లాడదలుచుకొని వచ్చావో నిర్భయంగా, నిస్సంకోచంగా మాట్లాడు!"

ఆమె కాస్సేపు మౌనంగా ఉండి, కళ్ళు అశ్రువులతో నిండిపోగా గాద్గదికమైన స్వరంతో అంది: "ఒక బలహీమైన క్షణంలో నేను పతితనైతే అయ్యానేమోగాని వ్యభిచారిణిని మాత్రంకాదండీ!"

"ఎవరన్నారా మాట నిన్ను?"

"ఈలోకం! నన్ను వ్యభిచారినిచూసినట్టుగా చూసి తరుముతున్నదండీ: ఎక్కడా నిలువ నీడ లేకుండా చేస్తున్నారండీ: మర్యాదగా బ్రతికే అవకాశమే నాకు లేకుండా చేస్తున్నారండీ!" ఆమె దుఃఖ ఆవేశంగా అంది. "మీరు చాలా హోమ్‌లు నడుపుతున్నారని విని వచ్చాను: నన్ను ఎక్కడపెట్టినా రెక్కలు దాచుకోకుండా చేస్తాను: కూడుగుడ్డ, బ్రతుక్కొక రక్షణ — ఇవి చాలండీనాకు: ఇంకే జీతం వద్దు!"

"నీ మాటలు వింటుంటే నీదిచాలా బరువైన కథ అనిపిస్తూంది: నీకు భర్తా, పిల్లలూ......"

"ఉన్నారమ్మా! భర్తా, ఆరుమందిపిల్లలూ, అత్తామామ...నాకు వాళ్ళున్నా వాళ్ళకి నేను లేను!"

"ఆరుమంది పిల్లల తల్లివి! ఏకాకివి ఎందుకయ్యావమ్మా? నీకథ చెప్పక పోతేనీకు ఆశ్రయమివ్వనని కాదు: నీకథ తెలిస్తే నీ జీవితంలో పలికిన అపశ్రుతిని నేనేమైనా సరిచేయగలనేమో అని!"

"దిద్దడానికి ఏమీ మిగల్లేదమ్మా: అంతా అయిపోయింది! సర్వనాశనం అయిపోయింది! నేను వేసిన తప్పటడుగుకు నాపిల్లలు తల్లి ఉండీ లేని వాళ్ళయ్యారు!" ఆమె తనదుఃఖాన్ని కొంచెంసేపటికి సంభాళించుకొని మొదలుపెట్టింది.

"మాది ఒకగ్రామం. మా మామగారు పురోహితుడు. పరమనైష్ఠికుడు. ఆచార సంపన్నుడు — మా అత్తగారు ఆయనకు తగిన భార్య. మా వారికి ప్రక్క బస్తీలో చిన్న ఉద్యోగం. నన్ను గ్రామంలోనే ఉంచి ఆయన వస్తూ పోతూ ఉండేవారు: నాపదిహేడోఏట పెళ్ళయ్యి అత్తవారింట అడుగు పెట్టాను: సంవత్సరం తిరగకుండా బిడ్డతల్లి నయ్యాను. తరువాత మూడేళ్ళకో కాన్పు...అయిదుమంది ఆడపిల్లల తరువాత వంశోద్ధారకుడు పుట్టాడు! వాణ్ణి ఈ చేతులతో పెంచి పెద్దజేసే అదృష్టం మాత్రంనాకు లేకపోయింది!" ఆమె బరువుగా ఒక్కనిట్టూర్పు విడిచి తిరిగి మొదలు పెట్టింది.

"వేణుగోపాల్ అని విలేజ్ వర్కర్ ఒకాయనకి ఎక్కడా ఇల్లు దొరక్కపోతే మాఇంట్లోనే ఓవైపు విడిగా వున్న రూం ఇచ్చారు ఉండడానికి. అతడి భార్య పురిటికి వెళ్ళడంవల్ల ఒంటరిగా చెయ్యికాల్చుకొంటున్నాడు. అప్పుడప్పుడూ మా అత్తగారు పప్పుకూరలూ, ఫలహారాలూపంపేది! వేణు చూడడానికి అందంగా, ఆకర్షణీయంగా ఉంటాడు. మనిషిని సమ్మోహనపరిచే నవ్వూ మాటల చాతుర్యంకల మనిషి. మావారు దగ్గర లేకపోవడం, అణుచుకొన్న కోరికలూ కాంక్షనిండిన వేణుకళ్ళ కవ్వింపుకు లొంగిపోయేలా చేశాయి నన్ను! ఆరుమంది పిల్లల తల్లి నన్న విషయమే విస్మరింపజేసింది. వేణు చుట్టిన మోహపాశం! ఒకరాత్రి వేణు గదిలోంచి బయటికి వస్తున్న నన్ను నిప్పులు చెరిగే కళ్ళతో నిలవేశాడు నాభర్త. ఆయన వెనుక మా అత్తా, మామా!

"నేనొక కులటగా ప్రపంచానికి బహిర్గతమైన దురదృష్టకరమైన రాత్రి అది. నన్ను మోహపాశంతో చుట్టినవాడు నాజీవితంలో దుష్టగ్రహమైన రాత్రి అది.

"కుక్కముట్టినకుండ! మాకు పనికిరాదు" అంది మాఅత్తగారు.

"నిత్యాగ్నిహోత్రం వెలిగే ఇల్లు ఇది. ఇంతటి ఘోర పాపానికి ఈఇంట్లో ప్రవేశంలేదు!" అన్నారు మా మామగారు.

"నువ్వు ఇంట్లో అడుగు పెడితే నా శవాన్నే చూస్తావు!" అన్నారు మా వారు.

"వాళ్ళకి కోడలిగా కాదు! ఆయనికి భార్యగా కాదు! నాపిల్లలకి తల్లిగా ఉండనివ్వమని కాళ్ళవ్రేళ్ళాపడ్డాను.నా తలనేలకు కొట్టుకు ఏడ్చాను! మరోసారి ఈ తప్పు నావల్ల జరుగదు అని చెప్పాను! లాభం లేకపోయింది! పాలుత్రాగే నాకొడుకుని నాచేతుల్లోంచి లాక్కొని ఆఇంటి తలుపులు నాకు శాశ్వతంగా మూసివేశారు!....."

ముఖంలో ఏభావం వ్యక్తంకాకుండా మౌనంగా వింటున్నది సువర్చలా దేవి.

"ఆరు మంది పిల్లల తల్లికి ఇదేం రోగం పుట్టిందని ఆశ్చర్యపోతున్నారా? నన్ను చూస్తే అసహ్యం వేస్తూందా?" పార్వతి అడిగింది.

"ఆశ్చర్యపోవడం లేదు! తప్పటడుగు కన్నెపిల్లలే వేయరు! కన్న తల్లులుకూడా వేస్తారు. అది పరిస్థితుల ప్రాబల్యం, నువ్వంటే అసహ్యం కలుగడంలేదు: పాతివ్రత్య భంగం అంతపాపవిషయం కాదు నాదృష్టిలో!"

"నేను చేసింది పావంకాదా?"

"అది పాపమే అయితే స్త్రీ పురుషులమధ్య ఈప్రేమలూ, ఆకర్షణలూ పెట్టిన భగవంతుడే దీనికి బాధ్యుడు!"

పావ భారంతో క్రుంగిపోతున్న తనను ఏ దేవదూతతో ప్రేమతో లేవనేత్తినట్టుగా అయిందిపార్వతికి. ఒకనిట్టూర్పు తేలికగా విడిచి అంది. "వేణు నాజీవితంలోకి వచ్చేంత వరకు మచ్చలేని జీవితం నాది! అతడి ప్రవేశంతో నాజీవితం కళంకితమైంది! బజారున వడింది నాజీవితం!"

"తరువాత?"

"గ్రామంలో ఉండడానికి మొహం చెల్లక ప్రక్కబస్తీ చేరాను. చిన్నప్పుడు అయిదో తరగతి వరకు చదువుకొన్నాను. పాటలు పద్యాలు వచ్చు. ఒక ప్రైవేట్ స్కూల్లో టీచరుగా ఉద్యోగం దొరికింది. పిల్లలకు చక్కటి పద్యాలు పాటలు నేర్పాను: పిల్లల తలిదండ్రులూ, బడి నిర్వాహకులూ ఎంతో ఇదిగా మెచ్చుకొని జీతం పెంచబోతున్న సమయంలో ఒకరొచ్చి గొడవపెట్టారు, చెడిపోయిన వాళ్ళొచ్చి స్కూల్లో చెప్పేట్టయితే మాపిల్లల్ని బడికి వంపించమంటూ. అంతే! ఆ ఉద్యోగం ఊడిపోయి వీధిని వడ్డాను. తిరిగి బ్రతుకు పోరాటం మొదలైంది: ఒకింట్లో వంటమనిషి, ఒకింట్లో పనిమనిషి, ఒకింట్లో ఆయా...చివరికి ఎవరూ పని ఇవ్వకపోతే వడ్డెరగుడిసెల దగ్గరికీ, లంబాడా తండాల దగ్గరికీ వెళ్ళి గాలికి తిరిగే వాళ్ళ పిల్లల్ని ప్రోగేసి చదువు చెప్పేదాన్ని! 'అమ్మగారు!' అంటూ వాళ్ళిచ్చే తృణమో పణమో తీసుకొనేదాన్ని. ఎలాగో నాగతం ఒక విషవాయువులా అక్కడా ప్రవేశించింది! వాళ్ళలో రాక్షసులూ, రావణాసురులూ పుట్టుకు వచ్చారు!

"నేను గౌరవంగా బ్రతకడానికి వెదుక్కొన్న ఒక్కోదారి మూసి వేశారండీ ఈజనం! తరిమి తరిమి 'వ్యభిచారం' అన్న ఒక్కదారి నాకోసం తెరిచిఉంచారండీ ఈజనం! నేను వ్యభిచారిణినైతే తప్ప ఈ జనం కళ్ళు చల్లబడవేమో! అదే నా పాపానికి తగిన ప్రాయశ్చిత్తం అనుకొంటున్నారేమో! అదేనాకు సరైన శిక్ష అని వాళ్ళ తీర్పు కావచ్చు! కాని, ఆ తీర్పు స్వీకరించే కంటే ఈజీవితాన్ని చిటికెడు విషంతో ముగించాలనుకొంటున్నానండీ!"

"తప్పమ్మా ఆ ఆలోచన! ఈభూమ్మీద పుణ్యాత్ములేకాదు, పాపాత్ములు కూడా ఉన్నారమ్మా! నువ్వొక్క దానివే బ్రతికే హక్కును ఎందుకు వదులుకోవాలి? ఈ సంసారుల్లో, ఈజనాల్లో 'వ్యభిచారి' అన్న ముద్రవడని ఎందరు వ్యభిచారులు లేరు? ఎందరు పతితలూ, భ్రష్టులూ లేరు? నీ దురదృష్టం నిన్ను బయటపెట్టిందిగాని! నిన్ను సమర్థిస్తున్నందుకు నేను వ్యభిచారాన్ని సమర్థిస్తానని అనుకోవద్దు! ముందు పరిస్థితులను చూశాకే మనిషిని చూడాలంటాను నేను. నీభర్త, నీ అత్త మామ నిన్ను వీధిలోకి నెట్టవలసింది కాదు. ఒకనిండు కుటుంబాన్ని వాళ్ళు చాలా అవివేకంతో బ్రద్దలు కొట్టారంటానునేను! ఆరు మంది పిల్లల తల్లిని ఈ ప్రపంచంముందు కులటగా నిలబెట్టి ఆపిల్లల భవిష్యత్తును అవమానం, అంధకారమయం చేశారంటాను నేను!" ఆవేశంగా అంది సువర్చలాదేవి.

"అదేకదా నాబాధ! నేను సర్వ నాశనం అయితే అయాను! నా పిల్లలేమౌతారో అనే నాబాధ!"

"నీకు మా హోంలో ఏదైనా పని ఇప్పించగలను, పార్వతీ: కాని, దానికంటే ముఖ్యం చితికిన నీకుటుంబం సరి కావడం! అందుకు నేనేమైనా చేయగలనేమో చూస్తాను!"

"వాళ్ళు కరుడు గట్టిన మనుషులు! పరమ ఛాందసులు! నన్ను నాకుటుంబంలో కలుపడమన్నది చాలా అసంభవమైన సంగతి, అమ్మా!"

"ప్రయత్నం నా వంతు! అవుతుందో కాదో తరువాత సంగతి!"

* * *

వీధి అరుగుమీద కూర్చొని వచ్చే, పోయే జనాలను చూస్తున్నాడు విశ్వనాథం. అతడు పార్వతి భర్త!

తమింటి ముందు ఎర్రటి మారుతికారు ఆగడం చూసి విస్తుపోయాడు, ఎందుకంటే తమింటికి కారులో వచ్చేవాళ్ళేవరూ లేరు కాబట్టి.

"శంకరశాస్త్రిగారిల్లిదేనా?" డ్రైవరు అడిగాడు.

"అవునిదే!"

వచ్చింది సువర్చలాదేవి! తమతో పనిచేసే మరో సోషల్ వర్కర్ వెంట తీసుకు వచ్చింది. సువర్చలా దేవికారు దిగి, 'విశ్వనాథ శాస్త్రి మీరేనా?' అనడిగింది.

"అవును."

"నేను మీతో పనిఉండి వచ్చాను!"

"లోపలికి రండి!"

పాతకాలంనాటి ఇల్లు. నాలుగు వైపులా వరండాలున్న మధ్యార కం. ముందు వరండాలో అరుగు. అరుగు మీద ఎవరైనావస్తే కూర్చోవడానికి చాపవేసిఉంది!

వచ్చిన వాళ్ళను దానిమీదికే ఆహ్వానించి కూర్చోబెట్టాడు విశ్వనాథం.

"మీ అమ్మ నాన్నగారు ఉంటే పిలవండి: మీపిల్లల్నికూడా!"

వృద్ధ దంపతులూ, పిల్లలూ వచ్చారు.

అందరి ముఖాల్లో ఒకే సస్పెన్స్! కుతూహలం!

వీళ్ళెందుకు వచ్చారు? అందరినీ ఇలా ఎందుకు సమావేశపరిచారు?

సువర్చలా దేవితో వచ్చిన మరోసోషల్ వర్కర్ తననూ, సువర్చలాదేవినీ పరిచయంచేసింది.

"నేను పార్వతి విషయం మాట్లాడడానికి వచ్చాను!" సువర్చలాదేవి అంది.

అందరి ముఖాల్లో విస్మయ కుతూహలాలు ఎగిరిపోగా వాటి స్థానంలో జుగుప్స ఛీత్కారాలు చోటు చేసుకొన్నాయి. బాంబుపడి సర్వనాశనం జరిగాక ఏర్పడే స్తబ్దత అక్కడ తాండవించసాగింది.

"మీ ఇంట్లో ఇరవయ్యేళ్ళు కాపురంచేసి, ఆరుమంది పిల్లల్ని కని ఈ ఇంటి కోడలిగా ఉన్న స్త్రీకి మీరివ్వాల్సిన ప్రతిఫలం అదికాదు.! ఆమెను వెళ్ళగొట్టి ఈఇంటిని శుద్ధిగాఉంచుకొన్నామని మీరు గర్వపడితే వడొచ్చుగాని ఆమచ్చ తాలూకు ప్రభావం మీఇంటిమీద వడకుండా ఉంటుందా? ఈ ఇంటికోడలు పతిత అంటే ఎవరికి అవమానం? ఎవరికి పరువు తక్కువ?"

"అది చేసిన దుర్మార్గానికి మా తలలు సిగ్గుతో వాలిపోతుంటే మమ్మల్ని నిలదీస్తున్నారేమిటి?" శంకర శాస్త్రి చిరాకుగా అన్నాడు.

"ఆ చెడిపోయినదానితో కాపురం చేయించుకొమ్మని ఉపదేశంకాబోలు!" ముసలామె దీర్ఘం తీసింది.

"మీరు వ్యంగ్యంగా అన్నా నా ఉపదేశం అదేనండి: ఒకస్త్రీ గురించి మాట్లాడేప్పుడు మీరూ ఒకస్త్రీ అన్న విషయం మరిచిపోవద్దు! ఈప్రపంచంలో అందరూ పతివ్రతలుకాదు! ఏదో ఒకదుర్బలక్షణంలో మానసికంగానే, శారీరకంగానో చలించని మనిషి ఉండడనే నాఉద్దేశ్యం. దాన్ని అర్థం చేసుకుందుకు సహృదయత కావాలండీ! ఆమె చేసిన తప్పునే చూశారుగాని దాని వెనుకనున్న ప్రోత్సాహక శక్తుల్ని గురించి ఎందుకు ఆలోచించరు? ఆరుమంది పిల్లల తల్లికి ఇదేం రోగమని అంటారుగాని ఉద్యోగరీత్యా దూరంగావుండి నెలకీ రెణ్ణెల్లకీ కలిసే భర్త ,పిల్లల్ని తప్ప ఆమెకేమిచ్చాడని మీరెప్పుడైనా ఆలోచించారా?" సువర్చాలాదేవి ఆవేశంగా అడిగింది. "ఎన్నో నిష్ఫలమైన రాత్రులు ఆమె హృదయంలో తుపాకీమందులా అశాంతినీ, అసంతృప్తినీ దట్టించి ఉంచాయని మీరెప్పుడైనా ఆలోచించారా?"

"నువ్వూ ఆడదానివై ఉండి ఇంతసిగ్గులేకుండా మాట్లాడుతున్నావేమిటని నాకు ఆశ్చర్యం వేస్తూంది!" ముసలావిడ మంటగా అంది." "భర్తరాత్రుళ్ళు దగ్గర లేకపోతే మరో మగాడిని వెదుక్కోమనా నీ సలహా?"

"స్త్రీజాతి మరీ అలా దిగజారిపోవాలని నేననను! దిగజారిన స్త్రీ గురించి మాత్రమే సహృదయంతో అర్థంచేసుకోడానికి ప్రయత్నించమని నాసలహా.....తాతగారూ! మీరు చూడడానికి పండితుల్లా ఉన్నారే! కోడలు తప్పుచేసిందని ప్రపంచంముందు పతితగా నిలబెట్టే ముందు మీ మనుమరాళ్ళ, మనుమల భవిష్యత్తు ఏమిటని ఒక క్షణమైనా ఆలోచించారా? ఆమచ్చ రాచపుండు అయ్యి ఆపిల్లల్ని జీవితంలో చిత్రవధ చేస్తుందని మీరెందుకని ఆలోచించలేదు? జీవితాన్ని చదువుకోలేని పాండిత్యం ఎందుకండీ శుష్కదండగా? మీరు ఆచారవంతులని విన్నాను. ఒకస్త్రీని నడి బజారులో దిక్కులేని దాన్నిచేసి వదిలిపెట్టే ఆచారం అదేం ఆచారమండీ, దురాచారమౌ తుందిగాని!"


సువర్చలాదేవి నిలదీసినట్టుగా అడుగు తుంటే శాస్త్రి గుడ్లు వెళ్ళబెట్టుకు చూడసాగాడు.

ముసలావిడ మాత్రం ఊరుకోలేదు. మండిపడుతూ అంది: "పిల్లలకి అటువంటి తల్లి ఉంటేనేం? లేకుంటేనేం? ఎందులోనైనా పడిచావక సిగ్గులేని బ్రతుకు బ్రతికి మా పరువు తీస్తూంది! పాడుముండ!"

"ఈప్రపంచంలో చెడ్డతండ్రులూ, చెడ్డ అన్నలూ, చెడ్డ అక్కలూ వగైరా ఉంటారుగాని చెడ్డతల్లులుండరండీ! తల్లి ఎటువంటిదైనా పిల్లలకికావాలి!....నువ్వుచెప్పు, పాపా! మీ అమ్మ మీకు కావాలా వద్దా?"....పదిహేడేళ్ళ వయస్సుండి అందరిలోకి పెద్ద పిల్లగా కనిపిస్తున్న అమ్మాయిని అడిగింది సువర్చలాదేవి.

తల్లి చేసిన పనికి ఆ పిల్లల మనస్సెప్పుడో విషపూరితమయ్యాయి!

"అమ్మా అది! బ్రహ్మరాక్షసిగాని! ఈప్రపంచమే మమ్మల్ని వెలివేసినట్టుగా చేసిపోయింది! కావరంతో ఆమె చేసిన పనికి మా జీవితాలు బలి అవుతున్నాయి! మా అక్కకు ఏసంబంధమూరాక కులం తక్కువవాడిని చేసుకు వెళ్ళిపోయింది! నాకూ నా తరువాత ఆడపిల్లలకూ అదే మార్గ దర్శకమౌతుందేమో చెప్పలేను! ఈరాయబారానికి మా జవాబు చెప్పండి! ఆమె చస్తే ఈమచ్చకొన్నాళ్ళకైనా మాసిపోయి మేంబ్రతికిపోతామని చెప్పండి!" ఆపిల్ల కత్తిలా పదునైన స్వరంతో చెప్పి



పంచదార చీమలు పట్టకుండా వుండాలంటే, నాలుగు లవంగాలు పంచదారలో పడెయ్యండి.

